మేరీ లూసీ కాషింగ్జ్

# 9. దుక్కపిల్ల

క్రిస్మస్ శలవు లయిపోయిన కొద్దిరోజులకు, జనవరి ఆఖరున ఆ దుక్కపిల్ల నా దగ్గిరికి వచ్చింది. ఆ శీతాకాలం నేను ఇరుగుపొరుగుల ఉండే పిల్లలకు పుస్తకాలు అరువివ్వ నారంభించాను. వాళ్ళు పుస్తకాలు తీసుకుపోయి మళ్ళీ తిరిగి ఇవ్వడానికి వారంలో ఒకరోజు ఏర్పాటు చేశాను. పిల్లలందరూ నాకు తెలిసిన వాళ్ళే అనుకోండి, కాని ఒక్కొక్కప్పుడు మా వీధికి చెందని కొత్త కొత్త పిల్లలుకూడా వచ్చేవారు. చాలామంది పుస్తకాలిచ్చి కొత్తవి తీసుకుని వెంటనే వెళ్ళిపోయేవారు, మరికొందరు అక్కడే కూర్చుని చదవడం మొదలుపెట్టేవారు. అప్పుడు నేను డెస్కుదగ్గిర కూచుని పని చూసుకునేదాన్ని. వాళ్ళు గోడబీరువాల పక్కన ఉండే చిన్న బల్లవద్ద కూర్చునేవాళ్ళు. వాళ్ళు నా పనికి ఏమీ భంగం కలిగించేవారు కారు, నాకు సరదాగాకూడా వుండేది.

ఈ దుక్కపిల్ల శుక్రవారంనాడో, శనివారంనాడో వచ్చింది. అది పుస్తకాలిచ్చే రోజుమటుకు కాదు. నేను బయటికి పోదామని నిర్ణయించుకుని, నేను సిద్ధం చేసుకున్న అల్పాహారం తీసుకుని గదిలోకి వచ్చాను. అంతకు ముందే ఎవరో వచ్చివెళ్ళారు, వాళ్ళు బయటివాకిలి మూయడం మరిచి ఉండాలి. అందుచేతనే ఆ దుక్కపిల్ల నా ఎదట అకస్మాత్తుగా ప్రత్యక్షమైంది. నేను నా ఫలహారం పళ్ళెం డెస్కుమీద పెట్టి, వంటింటినుంచి ఇంకేదో తీసుకురావడానికి వెనక్కు తిరిగి ఆ పిల్లను చూశాను. ఆ పిల్లకు సుమారు పన్నెండేళ్ళుండవచ్చు. పాతకాలపు వూలు కోటూ, అల్లిన నల్లని కాలితొడుగులూ ధరించింది, తాడు కట్టిన స్కేట్‌లు రెండు పట్టుకుని ఉన్నది. ఆమె నాకు తెలిసినట్టుండి కూడా తెలియరాలేదు. ఆమె చడీ చప్పుడూ కాకుండా వచ్చి నన్ను భయపెట్టింది.

నేను నిన్నెరుగుదునా ? అని ఆశ్చర్యంగా అడిగాను.

దుక్క-పిల్ల జవాబు చెప్పలేదు. చేతులు కలిపి బొజ్జమీద పెట్టుకుని, నీటి లాగా స్వచ్ఛంగా ఉన్న కళ్ళతో చూస్తూ నిలబడింది.

పుస్తకమేమన్నా కావాలా ? అని అడిగాను.

దుక్క-పిల్ల ఈసారికూడా జవాబు చెప్పలేదు. నా కేమంత ఆశ్చర్యంకూడా కలగలేదు. పిల్లలు సిగ్గుపడడమూ, వాళ్ళకు నేను సహాయపడడమూ నాకు అలవాటే. కనక కొన్ని పుస్తకాలు తెచ్చి ఆ పిల్లముందు పెట్టి, పుస్తకాలిచ్చే టప్పుడు నింపే కార్డుమీద రాయడానికి ఉపక్రమించాను.

నీ పేరేమిటి ? అని అడిగాను.

దుక్క-గుంట అని పిలుస్తారు, అన్నదా పిల్ల.

నన్నుకూడా అలాగే పిలవమంటావా ? అని అడిగాను.

ఆ పిల్ల నాతోబాటు చిరునవ్వు నవ్వక, తనకు ఎలాగైనా ఒకటే నన్నది. ఆ క్షణంలో ఆమె ముఖాన ఏదో వేదన కనబడినట్టు జ్ఞాపకం. కాని నే నప్పుడు పట్టించుకోలేదు.

ఎప్పుడు పుట్టావు ? అని ఇంకా ప్రశ్నించాను.

కుంభరాశిలో, అన్నదా పిల్ల తొణకకుండా.

ఆ సమాధానం వింటే నాకు నవ్వొచ్చి, వేళాకోళాని కా మాట కార్డులో కెక్కించాను. ఆ తరవాత పుస్తకాలకు వచ్చాను.

నీకు ప్రత్యేకించి కావలసిన దేమన్నా ఉందా ? అని అడిగాను.

కాని ఆ పిల్ల పుస్తకాలకేసి చూడడంలేదు, ఆమెకళ్ళు నా టీ, శాండ్విచ్‌లూ ఉన్న పళ్ళెంమీద ఉండడం నా కంటపడింది.

తినడాని కేమన్నా కావాలా ఏమిటి ? అని చప్పున అడిగాను.

ఆమె తల ఆడించింది. ఈ సంగతి నాకు ముందే తట్టనందుకు బాధతో కూడిన ఆశ్చర్యంలాటి భావం ఒకటి ఆమె ముఖాన కనబడింది. ఆమె శాండ్విచ్‌లు ఒక్కొక్కటే తినసాగింది. ఆమె తినే వైనం నాకు తరవాతగాని అర్థం కాలేదు. ఆ తరవాత ఆమె అలాగే కూర్చుని, అలుపుతోనూ, నిర్లిప్తతతోనూ కూడిన చూపులతో గది చుట్టూ కలయజూసింది. ఆమెను చూస్తుంటే ఎందుకో నాకు చిరాకూ, విముఖత్వమూ కలిగింది. మొదటినుంచీ ఆ పిల్లపట్ల నాకు ద్వేషం

ఏర్పడిన మాట నిజం. ఆ పిల్లలో కనిపించే చురుకులేనితనమూ, కొవ్విన, కుదురైన ముఖమూ, నిద్రమత్తుగానూ, ఒళ్ళుబరువుగానూ మాట్లాడే తీరూ—ప్రతిదీ నాకు ఏవగింపుగానే ఉన్నది. ఆమె మూలాన బయటికి వెళ్ళే ఆలోచన మానుకున్నప్పటికీ, ఆమె అంటే నాలో కొంచెంకూడా స్నేహభావం కలగక క్రూరంగానూ, ఉత్సాహరహితంగానూ ఉండిపోయాను.

డెస్కు దగ్గిర కూర్చుని, పనికి ఉపక్రమించుతూ, ఆ పిల్లకు చదవాలని ఎంతమాత్రమూ లేదని తెలిసికూడా, ఊఁ, చదువు, అనడంలో స్నేహభావం ఏముంటుంది గనక ? నే నలా కూర్చుని రాసుకుందా మనుకున్నాను, లేకపోతే ఇంకేదైనా చేద్దామనుకున్నాను. ఏమంటే: ఏదో ఊహించాలనీ, ఊహించగలిగితే గాని ప్రాణం కుదటబడదనీ అనిపించేటప్పుడు ఆ ఊహ తట్టకపోతే కలిగే మాకసికాందోళనలాటిది నన్నావహించింది. ఈ ఆందోళనను కొద్దిసేపు భరించాను. ఆ తరవాత నావల్ల కాక, వెనక్కు తిరిగి అతికీఅతకని ప్రశ్నలతో సంభాషణ సాగించాను,

నీ కెవరన్నా అన్నదమ్ములూ, అప్పచెల్లెళ్ళూ ఉన్నారా ? అని అడిగాను.

ఉన్నారు, అన్నదా పిల్ల.

నీకు బడంటే ఇష్టమేనా ? అని అడిగాను.

ఇష్టమే, అన్నదా పిల్ల.

నీ కెక్కువ ఏమిటిష్టం ?

అంటే ? అని ఆ పిల్ల అడిగింది

ఏ విషయం ? అన్నాను నిస్సహాయంగా,

నాకు తెలీదు, అన్నదా పిల్ల.

జర్మనుభాష ఇష్టమేమో ? అని అడిగాను.

నాకు తెలీదు, అన్నదా పిల్ల.

పెన్సిలు వేళ్ళసందున వుంచి తిప్పాను. నాకు భయంలాటి దేదో పుట్టుకురాసాగింది. దానికీ ఆ పిల్ల ఆకారానికీ ఎలాటి సంబంధమూ లేదు.

నేను వణికిపోతూ, నీ కెవరైనా స్నేహితురాళ్ళున్నారా ? అని అడిగాను.

లేకేం ? ఉన్నారు, అన్నదా పిల్ల.

నీకు మరీ ఇష్టమైనవాళ్ళుండాలి కాదూ ? అని అడిగాను.

ఏమో, అన్నదా పిల్ల. ఆమె ఆ ముతక పూలుకోటు వేసుకుని అలా కూచుని ఉంటే బలిసిన గొంగళిపురుగులాగా కనబడింది; తినడంకూడా గొంగళి పురుగులాగే తిన్నది, ఇప్పుడు దారి తడుముకుంటున్న గొంగళిపురుగులా గున్నది.

పగసాధించాలన్న వింతకోరిక లోపల ఉండి, నీ కింక తిండిపెట్టేది లేదు, అని లోపల అనుకున్నాను. అయినప్పటికీ లేచివెళ్ళి రొట్టె సాసేజి మాంసమూ తెచ్చిపెట్టాను. ఆ పిల్ల వాటికేసి నిర్వికారంగా తేరిపారజూసి గొంగళిపురుగు తిన్నట్టుగా, నింపాదిగానూ, విడవకుండానూ, లోపలినుంచి ఏదో తినమని ప్రేరేపిస్తున్నట్టుగా తినసాగింది. నే నా పిల్లను శత్రుభావంతో మౌనంగా గమనించాను.

నేనిప్పు డేస్థితికి వచ్చానంటే, ఆ పిల్లంటే నాకు అన్నివిధాలా ఆందోళనా, చిరాకూ పుట్టుకొస్తున్నది. ఆ తెల్లదుస్తు లేమిటి, ఆ ఎత్తుకాలరేమిటి అసహ్యంగా, అనుకున్నాను. ఆ పిల్ల తినడం ముగించి కోటు గుండీలు పెట్టుకుంటూంటే, నేను మళ్ళీ కూర్చుని పని చూడసాగాను, కాని అంతలో ఆ పిల్ల నా వెనకనుంచి పెదిమలతో చప్పుడు చేసింది. ఎక్కడో అడవిమధ్య ఉండే బురదనీటి గుంటలో బుడగ బద్దలైతే వచ్చే చప్పుడులాగుందా చప్పుడు. అందులో నాకు మానవస్వభావంలో గల నీరసమూ, మందకొడితనమూ, భారమూ, నైరాశ్యమూ స్ఫురించి నన్ను చాలా కుంగదీసింది. నాతో నీకేం పని? వెళ్ళిపో, వెళ్ళిపో, అనుకున్నాను. నా చేతులతోనే ఆ పిల్లను గదిలోనుంచి అవతలికి గెంటెయ్యాలనిపించింది, ఏదో సద్భుమృగాన్ని తోసేసినట్టు. కాని నే నామెను గదిలోనుంచి బయటికి గెంటటానికి మారుగా, ఆమెతో, వెనకటిలాగే దయారహితంగా సంభాషణ పెట్టుకున్నాను.

మంచుమీదికి పోతున్నావా? అని అడిగాను.

అవును, అన్నది దుక్కపిల్ల.

నీకు స్కేటింగ్ బాగా వచ్చునా? అని అడుగుతూ, ఆమె చేతినుంచి ఇంకా వేళ్ళాడుతున్న స్కేట్‌లకేసి చూపించాను.

మా అక్కకు బాగా వచ్చు, అన్నదా పిల్ల. మళ్ళీ ఆమె ముఖంలో బాధా, విచారమూ కనిపించాయి. ఈసారికూడా నేను పట్టించుకోలేదు.

మీ అక్క ఎలా ఉంటుంది? నీలాగే వుంటుందా? అని అడిగాను.

లేదు, లేదు. మా అక్క చాలా సన్నగా వుంటుంది. అక్క జుట్టు నల్లగా, నొక్కులు నొక్కులుగా ఉంటుంది. వేసంకాలం మేము పల్లెపట్టుకు పోయినప్పుడు రాత్రివేళ గాలివానవస్తే అక్క లేచివెళ్ళి, పైఅంతస్థు బాల్కనీలో కూర్చుని పాడుతుంది, అన్నదా పిల్ల.

మరి నువో ? అని అడిగాను.

నేను పక్క వదలను. నాకు భయం, అన్నదా పిల్ల.

మీ అక్కకు భయం లేదు, కాదూ ? అని అడిగాను.

లేదు. అక్క ఎన్నడూ భయపడదు. అన్నిటి కన్నా ఎత్తుగా ఉండే స్ప్రింగ్‌బోర్డు మీదినుంచి నీటిలోకి దూకేస్తుంది. తలకిందులుగా దూకి, చాలా దూరం ఈదుకుంటూ పోతుంది....

మీ అక్క ఏం పాడుతుంది ? అని అడిగాను ఉబలాటంగా.

తన యిష్టం వచ్చినది పాడుతుంది. పాటలు కడుతుంది, అన్నదా పిల్ల విచారంగా.

మరి నువో ? అని అడిగాను.

నే నేమీ చెయ్యను, అన్నదా పిల్ల. తరవాత లేచి నిలబడి, నే నిక వెళ్ళాలి, అన్నది. నేను చెయ్యి చాచాను. దుక్కల్లాంటి వేళ్ళు నా చేతిలో పెట్టింది. నాలో ఏం పుట్టిందో సరిగా చెప్పలేను—ఆమెను వెంబడించా లనిపించింది. ఆ ప్రేరణ మౌనంగాచేసిన బలమైన పిలుపు. మళ్ళీ ఎప్పుడైనా రా, అన్నాను. మనస్ఫూర్తిగా అన్నమాట కాదు. ఆ పిల్ల ఏమీ అనక ప్రశాంతమైన కళ్ళతో నాకేసి చూసింది. తరవాత ఆమె వెళ్ళిపోయింది. నాకు న్యాయంగా బరువుదిగినట్టయి ఉండవలిసింది. కాని బయటి తలుపు మూసిన చప్పుడయిందో లేదో, నేను చప్పున నడవలోకి పరిగెత్తి, కోటు వేసుకున్నాను. గబగబా మెట్లు దిగి నేను వీధిలోకి వచ్చేసరికి ఆ పిల్ల మలుపు తిరగడం కనిపించింది.

ఈ గొంగళిపురుగు స్కేటింగు చేస్తుంటే చూడాలి. ఈ బలిసిన బొండాం మంచుమీద ఎలా కదులుతుందో గమనించాలి, అనుకుని, ఆ పిల్లను చూపు మేరలో ఉంచడానికని చురుకుగా నడవసాగాను.

ఆ పిల్ల నా గదిలోకి వచ్చినప్పుడు అపరాహ్ణమై ఎంతోసేపు కాలేదు, ఇప్పుడు చీకటి పడబోతున్నది. నే నా నగరంలో చిన్నతనంలో కొన్ని సంవత్సరా

లున్నప్పటికీ, ఇప్పుడు నాకు దారి సరిగా తెలీదు. నే నా పిల్లను వెంబడించే దృష్టితో ఉండడంలో మేమే ప్రాంతంలో ఉన్నదీ కూడా తెలియకుండా పోయింది. నాకు అన్ని వీధులూ, చౌకులూ కొత్తగా కనపడసాగాయి. అకస్మాత్తుగా వాతావరణమంతా మారినట్టు నాకు అనిపించింది. ఎంతో చలి అనిపిస్తూ ఉండినది కాస్తా, మంచు కరిగే స్థితిగా మారినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. ఈ మార్పు ఎంత తీవ్రంగా ఉన్నదంటే, చెట్లమీదినుంచీ, ఇళ్ళకప్పుల మీదినుంచీ మంచు కరిగి కారనారంభించింది. ఆకాశాన వడమబ్బులు తిరుగుతున్నాయి. మేము నగరం శివార్లకు వచ్చేశాం; అక్కడ ప్రతి ఇంటిచుట్టూ పెద్ద పెద్ద తోటలున్నాయి. చివరకు ఇళ్ళు అయిపోయాక ఆ పిల్ల చప్పున పల్లంలోకి పరుగెత్తి కనబడకుండా పోయింది. అక్కడికి వెళ్ళిచూస్తే స్కేటింగు చేసే స్థలమూ, దీపాలతో వెలిగి పోయే కొట్లూ, ఆర్క్‌లైట్లూ, మిలమిలా మెరిసే స్కేటింగు రంగంలో సంగీతమూ, సందడీ ఉంటాయనుకున్నాను, కాని నేను చూసిన దృశ్యం అది కానేకాదు. ఆ పల్లంలో వున్నది సరస్సు. దాని చుట్టూ ఈసరికి ఇళ్ళు లేచి ఉంటాయనుకున్నాను; కాని అది నిర్జనంగా ఉన్నది. నా చిన్నతనంలోలాగే ఉన్నది, దాని చుట్టూ నల్లని చెట్ల గుంపులున్నాయి.

తలవని తలంపుగా ఇలాటి దృశ్యం కళ్ళబడడంతో నే నా పిల్లజాడ పోగొట్టుకున్నంత పని చేశాను. కాని నా కామె సరస్సు ప్రక్కన చతికిలబడి కూర్చుని కనబడింది; కాలిమీద కాలువేసుకోవడానికీ, ఒక చేత్తో స్కేట్‌ను పాదానికి ఆనించి పట్టుకుని, రెండోచేత్తో శీల బిగించడానికీ యత్నిస్తున్నది. ఒకటి రెండు సార్లు శీల పడిపోయింది. దానికోసం వెతుకుతూ ఆమె మంచుమీద పాకుతుంటే ఏదో వింతరకం గోదురుకప్పలాగా కనబడింది. అంతకంతకూ చీకటి ముదురుతున్నది. సరస్సులోకి చొచ్చుకుపోయిన రేవుగట్టు ఆ పిల్లకు కొద్ది గజాల దూరంలోనే వున్నది. సరస్సు పైభాగం వెండిలాగా తెల్లగా మెరుస్తుంటే ఈ గట్టు చీకటి నలుపులో కనబడింది. సరస్సు పైభాగమైనా అంతటా ఒకే రకంగా మెరవక, అక్కడక్కడా నల్లనికరలు కనిపిస్తున్నాయి. మంచు కరగడం సాగుతున్నట్టు ఈ కరలే గుర్తు. వేగిరం, అని తొందరపడుతూ కేకపెట్టాను. ఆ పిల్లకూడా త్వరగా కదిలింది; అయితే నేను తొందర పెట్టడంవల్ల కాదు, దూరాన ఎవరో రావే, దుక్కగుంటా, అని కేక పెట్టడంచేత. అలా కేక పెట్టిన

ఆకారం కాంతిమంతంగా ఉండి, మంచుమీద వలయాలుచుట్టుతూ తిరుగుతున్నది. నృత్యాలు చేసి, గాలివానల్లో పాటలుపాడే 'అక్క' ఈ మనిషే అయి వుంటుందని. నాకు తట్టింది. ఈమె నాకు నచ్చిన పిల్ల. ఆ సమయంలో నే నక్కడికి వచ్చినది ఈ నాజూకైన పిల్లను చూడడానికేనని ఆ క్షణంలో నేను నమ్మాను కూడా. అయితే, ఆ ఇద్దరుపిల్లలూ ఎలాటి ప్రమాదస్థితిలోవున్నదీ నేను గుర్తించకపోలేదు. ఎందుకంటే, అదే సమయంలో ఆకస్మికంగా ఒకవిధమైన మూలుగూ, నిట్టూర్పులాటి ధ్వనులు—సరస్సుమీద పేరుకున్న మంచు విచ్చేటప్పుడయే ధ్వనులు— ఆరంభమయాయి. నిట్టూర్పులు దయ్యపు దుఃఖంలాగున్నాయి. అవి నాకు వినిపించాయి గాని, ఆ పిల్లలకు వినిపించలేదు.

వాళ్ళా ధ్వనులు వినలేదనడానికి సందేహంలేదు. ఎందుచేతనంటే, అసలే పిరికిదైన ఆ దుక్కపిల్ల వాటిని వింటే మంచుమీదికి బయలుదేరకపోను, కదలలేకుండా కదులుతూ ఇంకా ముందుకు పోవడానికి ప్రయత్నించకపోను; ఆమె అక్కకూడా దూరంనుంచి నవ్వుతూ, చెయ్యిఊపి, స్కేట్‌ల మొనలమీద నిలిచి బొంగరంలాగా చక్కర్లు కొట్టకపోను, తరవాత ఎనిమిది అంకె ఆకారంలో అందంగా చుట్టకపోను. దుక్కపిల్ల నల్లటి ప్రదేశాలమీదుగా స్కేట్‌చేస్తూ వెళ్ళి, వాటిని చూసి దడుచుకున్నది. ఆమె అక్క చప్పున తిరగడం మానేసి, దూరంగా, మంచుమీద జారుతూ వెళ్ళిపోయింది.

నేను రేవుగట్టు వెంబడి ఒక్కొక్క అడుగే వేసుకుంటూ ముందుకు సాగడంచేత నాకు అంతా స్పష్టంగా కనిపించింది. కొయ్యపలకల మీద మంచు పేరుకుని ఉన్నప్పటికీ, దిగువన దుక్కపిల్ల కదిలినదానికన్న నేనే హెచ్చువేగంతో కదిలాను. నేను వెనక్కుతిరిగి చూసినప్పుడా పిల్లముఖం కనిపించింది; అది నిర్వికారంగా కనిపించినప్పటికీ అందులో గాఢమైన ఆకాంక్ష ఉండనేఉన్నది. అంతటా మంచు నెర్రెలు వచ్చి, ఆ నెర్రెలకుండా నురుగు, వెర్రివాడి నోటినుంచి వెలువడినట్టుగా, పైకిరావడం చూశాను. అప్పుడే ఆ దుక్కపిల్ల కాళ్ళకింది మంచు విరిగిపోవడంకూడా నాకు కనబడింది. ఇది జరిగినచోటు రేవుగట్టుకు కొద్దిబారల దూరంలోనే ఉన్నది, అక్కడే ఈ పిల్లఅక్క మంచునృత్యాలు చేస్తూవుండింది కూడానూ.

నిజానికి ఆ పిల్ల మంచుకుండా నీటిలో పడిపోవడంలో ప్రాణాపాయ పరిస్థితి ఏమీలేదని చెప్పాలి. సరస్సు కరుడుకట్టేటప్పుడు పొరలు పొరలుగా మంచు

ఏర్పడుతుంది. పైపొరకు మూడడుగుల దిగువనున్న పొర దృఢంగానే ఉన్నది. అందుచేత ఆ దుక్కపిల్ల మూడడుగులలోతు నీటిలో దిగబడింది. ఆ పిల్ల ఉన్నది మంచునీటిలో నన్నమాటా, ఆమెకు అన్నివేపులా మంచుగడ్డలు విచ్చుతున్న మాటా యథార్థమే, కాని ఆమె కొద్ది అడుగులు నీటిలో నడుస్తూ వస్తే రేవుగట్టు చేరుకుని, పైకి రావచ్చు, నేను సహాయం చెయ్యగలుగుతాను. కాని ఆమె ఆ మాత్రం ప్రయత్నంకూడా చెయ్యలేదని నాకు అకస్మాత్తుగా తోచింది. ఆమె భయంతో చచ్చిపోతూ, అలాగే నిలబడిపోయి, వ్యర్థంగా తడువులాడుకున్నది గాని, గట్టును సమీపించే ప్రయత్నం ఏమీ చేయ్యనుకూడా లేదు. ఆమెచుట్టూ నీరు సుడులు తిరుగుతున్నది, మంచు విరిగిపోతున్నది. కుంభరాశి అధిదేవత ఆమెను దిగువకు ఈడ్చేస్తున్నాడు. అయితే నాలో చలనం లేదు, పిసరంత జాలి కలగలేదు. నిశ్చలంగా వుండిపోయాను.

కాని అంతలోనే దుక్కపిల్ల చప్పున తల ఎత్తింది. ఇప్పటికి రాత్రి అయి, మబ్బులమాటునుండి చంద్రుడు పైకివచ్చి వుండడాన ఆ పిల్లముఖంలో ఏదో మార్పు వచ్చినట్టు నేను చూడగలిగాను. ముఖలక్షణాలు పూర్వంలాగే ఉన్నట్టుండికూడా మార్పుచెందాయి. మృత్యుముఖంలో ఉండి, జీవితసౌరభా న్నంతనూ ఆస్వాదించిన విధంగా, ఆమె ముఖం సత్త్వంతో కూడిన ఉద్రేకంతో విప్పారింది. అవే ఆఖరుక్షణాలనీ, మృత్యువు సమీపంలోనే ఉన్నదనీ నే నను కున్నమాట నిజమే. నేను అలవ కమ్మీలమీదికి వంగి దిగువనవున్న పాలిపోయిన ముఖంలోకి చూశాను. అది నల్లని నీటిలోని ప్రతిబింబంలాగా కనబడింది. అయితే ఇప్పుడా పిల్ల రేవుగట్టును సమీపించింది. చేతులుచాచి, చెక్కకూర్పులో అమర్చిన శిలలనూ, కొక్కాలను పట్టుకుని పైకిలేవడానికి చురుకుగా ప్రయత్నించింది. అయితే ఆమె శరీరం మరీ బరువైపోయింది. చేతులు కోసుకుపోయి రక్తం చిమ్మాయి. ఆమె వెనక్కు పడిపోయి, మళ్లా ప్రయత్నం ప్రారంభించింది. నేనా దీర్ఘమైన పోరాటాన్ని కళ్ళారా చూశాను. గుడ్డును పగలదీసుకొనీ, పిసినికాయను చీలదీసుకునీ బయటికి రావడంలాగా, విముక్తికోసం చేసే భయంకర సంఘర్షణ లాటిదది. ఇప్పుడు నే నామెకు సహాయం చెయ్యగల స్థితిలో వున్నాను. కాని ఆమెకు నా సహాయం అవసరం లేదని నాకు తెలిసిపోయింది; నే నామెను పోల్చాను....

ఆ సాయంకాలం నే నింటికి తిరిగి రావడం నాకు జ్ఞాపకంలేదు. నాకు జ్ఞాపకం ఉన్నదల్లా, మెట్లమీద పక్కనుండే ఆవిడ ఎదురైతే, సరస్సుచుట్టూ ఇంకా కొన్ని పొలాలూ, చీకటిచెట్లతోపులూ ఉన్నాయనడమూ, ఆమె, లేదు, ఏమీలేవు, అనడమూనూ. ఆ తరవాత నేను నా డెస్కుమీది కాగితాలు చిందర వందరగా ఉండడం గమనించాను. వాటిమధ్య ఒక పాత ఫొటో, నాదే, ఉన్నది. అందులో నేను ఎత్తుకాలరుగల తెల్లని పూలుకోటు తొడుక్కున్నాను, చాలా లావుగా ఉన్నాను. నా కళ్లు స్వచ్ఛంగానూ, తడిగానూ ఉన్నాయి.